www.vaarthavedhikasurya.com

RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



7 లో

చదువులోనే కాదు

## క్రీడల్లో రాణించాలి

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

యాదాద్రి భువనగిరి | బుధవారం 05, నవంబర్ 2025 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 167 | పేజీలు: 08 | వెల: 5/

# రేవంత్.. ఫీజు బకాయిలు అడిగితే విద్యార్థులను బెదిరిస్తారా?

- భార్యలకు ఉచిత బస్సు ప్రయాణం.. భర్తలకు మాత్రం టికెట్ ధర రెట్టింపు
- లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేయడానికి కాంగ్రెస్ కుట్ర
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులకు విద్యను దూరం చేయాలని కాంగ్రెస్ చూస్తోంది
- అదే కాంగ్రెస్ ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో 'మరో అవకాశం' కోసం యాచిస్తోంది
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడించి, మోసపోయిన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరపున బుద్ధి చెప్పండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి



హైదరాబాద్,నవంబర్ 4(వార్త వేదిక సూర్య): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 10,000 కోట్లకు పైగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి, తద్వారా లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను పొందే హక్కును దూరం చేస్తున్నారని భారాస వర్కింగ్ మిగతా 2లో..

# ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

- సంస్కరణలపై అధ్యయానికి కమిటీ ఏర్పాటు
- కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు

హైదరాబాద్,నవంబర్ 4(వార్త వేదిక సూర్య): రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంలో మార్పులకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో చాలా అవతకవకలతో పాటు, అక్రమాలు చోటుచేసుకుంటున్నా యన్న ఆరోపణల



నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకొంటున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు ఆందోళనకు దిగాయి. కాలేజీల బంద్ కొనసాగి స్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి మిగతా 2లో..



# అకాల వర్షంతో తడిసిపోయిన పత్తి, వరిధాన్యం

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరోమారు వర్షం
- హైదరాబాద్‌లో పలుచోట్ల కురిసిన వర్షం

వరంగల్,నవంబర్4(వార్తవేదిక సూర్య): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములతో వర్షాలు దంచికొట్టాయి. మంగళవారం ఉదయం నుంచి కుండపోత వానలు కురిశాయి. వరంగల్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వర్షానికి నగర రహదారులు చెరువులను తలపించాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్‌జామ్ అయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఎనుమాముల మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న తడిసిపోయింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఏర్పడ్డ 'మొంథా' తుపాను ముంపు నుంచి ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలు పూర్తిగా తేరుకోలేదు. మరోసారి మిగతా 2లో..

# అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ


- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



హైదరాబాద్,(వార్త వేదిక సూర్య): రాష్ట్ర మంత్రి అజారుద్దీన్‌కు ప్రభుత్వం శాఖ కేటాయించింది. అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. మిగతా 2లో..

# సిగాచీ ఉల్లంఘనలపై హైకోర్టులో కేసు

- కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారన్న కోర్టు



హైదరాబాద్,(వార్త వేదిక సూర్య): సిగాచీ పరిశ్రమలో పేలుళ్ల ఘటనపై కలపాల బాబూరావు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. సిగాచీ పేలుడు ఘటనలో 54 మంది మృతి చెందారని, ప్రమాదం మిగతా 2లో..

# వ్యవసాయం మనజీవన విధానంలో భాగం

- 54 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం
- దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉంది
- 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో ప్రపంచంలోనే తొలిస్థానం
- అగ్రి బిజినెస్ అవార్డుల ప్రదానంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్,(వార్త వేదిక సూర్య): దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా.. వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలోని మిగతా 2లో..



# జూబ్లీహిల్స్‌లో 30వేలతో గెలుపు..!

- చెల్లిని గెంటేసిన నీచుడు కెటిఆర్
- రహమత్ నగర్ రోడ్‌షోలో సిఎం రేవంత్

హైదరాబాద్,నవంబర్ 4(వార్త వేదిక సూర్య): జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజార్టీతో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో భాగంగా మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి రహమత్ నగర్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఓటర్లను ఉద్దేశిస్తూ ప్రసంగం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప ఎన్నికలు వచ్చాయి.. మా అభ్యర్థి చనిపోయారు? ఆయన సతీమణికి ఓటేయండి అని అడుగుతున్నారని, పట్నం వచ్చిన పేదలకు ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు కల్పించిన వ్యక్తి పీజేఆర్ అన్నారు. పీజేఆర్ ఆడబిడ్డల కోసం కృష్ణ జలాలు హైదరాబాద్ తీసుకువచ్చారని, పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చింది పీజేఆర్ అని రేవంత్ రెడ్డి అన్నారు. అలాంటి పీజేఆర్ చనిపోతే.. ప్రత్యర్థిగా ఉన్న చంద్రబాబు కూడా పీజేఆర్ కుటుంబానికి మద్దతు ఇచ్చారని, కానీ కేసీఆర్ మాత్రం.. సెంటిమెంట్ లేదు.. ఏకగ్రీవం ఇచ్చేది లేదని పీజేఆర్ కుటుంబం మీద పోటీకి పెట్టారన్నారు. పీజేఆర్ కుటుంబంనీ కేసీఆర్ తన ఇంటి ముందు మూడు గంటలు కూర్చోపెట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా.. 'పాలేరులో రాంరెడ్డి వెంకట్ రెడ్డి చనిపోతే.. నారాయణపేటలో కృష్ణారెడ్డి చనిపోతే పోటీ పెట్టింది కేసీఆర్ కాదా.. ఆనాడు చేసిన తప్పులకు మిగతా 2లో..

# హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలి



- జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందం భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్ 4(వార్త వేదిక సూర్య): డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో మంగళవారం తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ని హైదరాబాద్‌లో ప్రారంభిస్తున్నట్టు ముఖ్యమంత్రికి జర్మనీ బృందం తెలిపింది. జీసీసీ ఏర్పాటుకు హైదరాబాద్ ను ఎంచుకున్నందుకు



# ఛత్తీస్‌ఘడ్‌లో ఎదురెదురుగా ఢీకొన్న ప్యాసింజర్ గూడ్స్ రైలు

- ఏడుగురు మృతి, 15 మందికి తీవ్రగాయాలు
- మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారం
- గాయపడిన వారికి రూ. 5 లక్షలు
- పాసింజర్ రైలు రెడ్ సిగ్నల్‌ను జంప్ చేయడం వల్లే ప్రమాదం..
- ఛత్తీస్‌గఢ్ రైలు ప్రమాదంపై రైల్వే బోర్డు

హైదరాబాద్,నవంబర్ 4(వార్త వేదిక సూర్య): ఛత్తీస్‌గఢ్‌లో రెండు రైళ్లు ఢీకొన్నాయి. మంగళవారం బిలాస్‌పుర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పలువురు మృతి చెందినట్లు తెలుస్తోంది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో లాల్‌ఖదాన్ ప్రాంతంలో మెము ప్యాసింజర్-గూడ్స్ రైళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దాంతో పలు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంతో బిలాస్‌పుర్-హావ్‌డా లైన్ మార్గంలో రైళ్లరాకపోకలకు పూర్తి అంతరాయం ఏర్పడింది. దాంతో పలు సర్వీసులను రద్దు చేశారు. మరికొన్నింటిని దారిమళ్లించారు. ఈ ఘటన వల్ల ఆ మార్గంలో ఎలక్ట్రిక్ వైర్లు, సిగ్నల్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న అధికారులు ఘటనాస్థలికి చేరుకొని సహాయచర్యలు చేపట్టారు. వైద్య సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకున్నారు. దెబ్బతిన్న కోచ్‌లను పట్టాల నుంచి తొలగిస్తున్నారు.



# టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం

- చేవెళ్ల రోడ్డు ప్రమాదస్థలిని సందర్శించిన డిజిపి
- టిప్పర్ వేగంతోనే బస్సుకు ప్రమాదం
- దర్యాప్తులో పూర్తి వివరాలు తెలుస్తాయని వెల్లడి

హైదరాబాద్,నవంబర్ 4(వార్త వేదిక సూర్య): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై పోలీసుల దర్యాప్తులో అన్ని విషయాలు వెల్లడవుతాయని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ బస్సు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. టిప్పర్ అతివేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదం జరిగిన తీరు చూస్తే టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ఇక రోడ్డు ప్రమాదానికి గురైన టిప్పర్ కండిషన్‌ను మెకానిక్ ద్వారా పరీశీలిస్తున్నా మన్నారు. దాదాపు 40 మీటర్లు టిప్పర్ లాక్కేళ్లడంతో ఈ ప్రమాద తీవ్రత పెరిగిందని వివరించారు. ఈ ప్రమాద సమయంలో ఆర్టీసీ బస్సులో రైట్‌సైడ్ కూర్చున్న వారు చాలా మంది తమ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అయితే రోడ్డు మలుపు ఉంది కానీ.. అది యాక్సిడెంట్ అయ్యేంత తీవ్రంగా లేదన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన టిప్పర్ లారీ ఓనర్ లక్ష్మణ్ నాయక్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను ప్రభుత్వ పరంగా చూడకూడదని.. ఇది అందరి బాధ్యతగా చూడాల్సి ఉందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.

# బీహార్‌లోనూ ఉచిత పథకాల వెల్లువ


- సంక్రాంతి కానుకగా మహిళల ఖాతాల్లో 30వేలు జమ
- మద్దతు ధరలకు అదనంగా 300,400 చెల్లింపులు
- సొంతూరికి 70 కి.మీ దూరంలోనే ఉద్యోగుల బదిలీలు
- మీడియా సమావేశంలో ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్



పాట్నా,నవంబర్4(వార్త వేదిక సూర్య): బీహార్ ఎన్నికల తరుణంలో ఆర్‌జెడి నేత, మహాగట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలో నిలిచిన తేజస్వీయాదవ్ ప్రజలకు వరాల జల్లు కురిపించారు. ముఖ్యంగా రైతులు పండించిన వరి గోధుమలకు మిగతా 2లో..

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

- మరోమారు షెడ్యూల్ ప్రకటించిన స్పీకర్
- ఈ నెల 6నుంచి వరుసగా విచారణలకు సిద్ధం



హైదరాబాద్,నవంబర్4(వార్త వేదిక సూర్య): తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. ఎల్లుండి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగనుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# చేవెళ్ల బస్సు ప్రమాద ఘటన

### సుమోటోగా కేసు నమోదు చేసిన మానవహక్కుల సంఘం



హైదరాబాద్,నవంబర్ 4(వార్త వేదిక సూర్య): రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగిన బస్సు ప్రమాద ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. తమ వారిని కోల్పోయి కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. మీడియా ఛానల్స్, పలు పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కమిషన్ చర్యలు తీసుకుంది. ఈ సంఘటనపై డిసెంబర్ 15లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని రోడ్లు రవాణా, భవనాల శాఖ, హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీలకు కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ రీజినల్ ఆఫీసర్ కు కూడా నివేదిక సమర్పించాలని హెచ్ఆర్సీ ఆదేశించింది. మరోవైపు చేవెళ్ల బస్సు ప్రమాదంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ప్రమాదం జరిగిన స్థలాన్ని డీజీపీ శివధర్ రెడ్డి, సీపీ అవినాష్ మహంతి, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. నిన్న(సోమవారం) తెల్లవారు జామున తాండూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సు చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. బస్సును కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో లారీలో ఉన్న కంకర మొత్తం బస్సులో కుప్పగా పడిపోయింది. ఈ ప్రమాదంలో 19 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 34 మంది గాయపడటంతో వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టిప్పర్ అతివేగం కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు.

# బీహార్‌లోనూ ఉచిత పథకాల వెల్లువ

(మొదటి పేజీ తరువాయి)

ఎంఎస్‌పి ధర కంటే అదనంగా క్వింటాలుకు రూ. 300, 400 చొప్పున చెల్లించనున్నట్లు హామీనిచ్చారు. మహిళల బ్యాంకు ఖాతాలో 30 వేల చొప్పున జమ చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగులైన పోలీసులు, టీచర్లు, ఆరోగ్య కార్యకర్తల బదిలీలు వారి సొంత ఇంటికి 70 కిలోమీటర్లలోపే బదిలీలు ఉంటాయని ప్రకటించారు. ఇప్పటికే ఇంటికో ఉద్యోగం ప్రకటించిన తేజస్వీ ఎన్డీఏ కూటమిని దెబ్బతీసేందుకు అలవికాని హామీలు ఇస్తున్నారు. తాజాగా బిహార్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కీలక హామీ ప్రకటించారు. మంగళవారం తేజస్వీయాదవ్ పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఇండియా కూటమి బిహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే 'మై-బహిన్ మాన్ యోజన'ను ప్రారంభిస్తామన్నారు. ఇందులోభాగంగా జనవరి 14న సంక్రాంతి రోజున రాష్ట్రంలోని మహిళలకు ఏడాదికి రూ.30వేలు కానుకగా అందచేస్తామని వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం ఇటీవల అక్కడి మహిళలకు నవరాత్రి కానుకగా ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసిన నేపథ్యంలో తేజస్వీ ఈ ప్రకటన చేశారు. గత వారం ప్రతిపక్షాలు విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రకారం.. డిసెంబర్ 1 నుంచి మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయంగా రాబోయే ఐదేళ్ల పాటు ఒక్కో సంవత్సరానికి మొత్తం రూ.30,000 ఇస్తామని తేజస్వీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగానే అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ఏడాదికి గాను మహిళలకు రూ.30వేలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బిహార్ మహిళల కోరిక మేరకు ఏడాదికి చెల్లించే మొత్తం రూ.30 వేలను జనవరి 14న వారి ఖాతాలకు బదిలీ చేస్తామని తేజస్వీ తెలిపారు. కనీస మద్దతు ధర (ఓ-ఊఖ)తో పాటు బోనస్‌గా రైతులకు క్వింటాలు వరికి రూ.300, గోధుమలకు రూ.400 చెల్లిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా పోలీసు సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు వంటి అన్నిరకాల ప్రభుత్వ సిబ్బందికి వారి సొంత జిల్లాల నుంచి 70 కిలోమీటర్ల పరిధిలో నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా బిహార్ ఎన్నికల నేపథ్యంలో విపక్ష కూటమి మహాగఠ్‌బంధన్ ఇటీవల 'తేజస్వీ ప్రతిజ్ఞా ప్రణ్' పేరుతో తమ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అందులో తాము అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర హామీలను అమలు చేస్తామని పేర్కొంది.. రైతులకు నీటి పారుదల కోసం ఉచిత విద్యుత్ అందిస్తాము. మై బహిన్ మాన్ యోజన పథకం కింద మహిళల బ్యాంక్ ఖాతాల్లో జనవరి 14వ తేదీకల్లా రూ. 30,000లు జమ చేస్తాం.

ఇది సంవత్సరం మొత్తానికి వర్తిస్తుంది. నూతన సంవత్సరం, మకర సంక్రాంతి పండుగల సందర్భంగా ముందుగానే నగదును జమ చేస్తాం. నిత్యవసర ధరలు పెరిగిన ఈ సమయంలో.. ఈ డబ్బుతో వారికి కొంత ఆర్థిక ఉపశమనం లభిస్తుంది. రాష్ట్రంలోని మా తల్లులు, సోదరీమణుల డిమాండ్ల మేరకే మా ప్రభుత్వం ఏర్పడుతుంది' అని ఆయన అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మహాగఠ్బంధన్ కట్టుబడి ఉందని తేజస్వీ తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తల బదిలీలు వారి ఇంటి నుండి 70 కిలోమీటర్ల లోపే వారి బదిలీలు చేస్తాము. బదిలీల పోస్టింగ్‌లో కచ్చితంగా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటాము. దీన్నే మ్యానిఫెస్టోలో కూడా ప్రస్తావించాము అని తేజస్వీ అన్నారు.

# అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణస్వీకారం చేసిన నాలుగు రోజులకు అజారుద్దీన్‌కు శాఖ కేటాయించారు. మొత్తంగా రాష్ట్ర కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. మరో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మైనార్టీల ఓట్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చిన సంగతి తెలిసిందే. 'బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముస్లింకు హోంశాఖ ఇచ్చారు. ఇప్పుడు కూడా హోంశాఖను నాకు కేటాయించి ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించాలి' అని అజారుద్దీన్ సీఎం రేవంత్‌ను కోరినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. తనకు హోం శాఖ ఇస్తేనే ముస్లిం మైనార్టీలు ప్రభుత్వాన్ని నమ్ముతారని, జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అనవసర చర్చలకు తావులేకుండా శాఖల కేటాయింపు వీలైనంత త్వరగా ముగించాలని అజారుద్దీన్ కోరినట్టు తెలిసింది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద ఉన్న కీలక శాఖలు ఎవరికీ ఇచ్చేది లేదని, మైనార్టీ వెల్ఫేర్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాలని చెప్పినట్టు సమాచారం. జూబ్లీహిల్స్‌లో ఓడినా పోయేదేమీ లేదు.. హోంశాఖ మాత్రం ఇంకొకరికి ఇచ్చే ప్రసక్తి లేదని తెగేసి చెప్పినట్టు ప్రచార అవుతున్నది. ఆ మేరకే అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.

# సిగాచీ ఉల్లంఘనలపై హైకోర్టులో కేసు

(మొదటి పేజీ తరువాయి)

జరిగి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. బాధితులకు ఇస్తామన్న రూ.కోటి పరిహారం కూడా ఇవ్వలేదని, ఎన్నో ఉల్లంఘనలు జరిగినట్టు దర్యాప్తులో తేలిందని వివరించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ కంపెనీ ఎండీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మృతులు, బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం రెండు వారాలకు వాయిదా వేసింది. నిపుణుల కమిటీ నివేదికను విశ్లేషిస్తున్నామని అదనపు అడ్వొకేట్ జనర్ రజనీకాంత్ తెలిపారు. 192 మంది ప్రత్యక్ష సాక్షుల నుంచి పోలీసులు వాంగ్మూలం సేకరించారు. సిగాచీ కంపెనీకి చెందిన వైస్ ప్రెసిడెంట్ సైతం ప్రమాదంలో చనిపోయారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా పోలీసులు చర్యలు తీసుకోనున్నారు' అని కోర్టుకు తెలిపారు. బాధితులకు రూ.కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు చెల్లించామని, కంపెనీ నుంచి మిగతా డబ్బులు వచ్చేలా చూస్తున్నామని ఏఏజీ వివరణ ఇచ్చారు. రెండు వారాల్లో సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఏఏజీని హైకోర్టు ఆదేశించింది.

# ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

సంస్కరణలపై కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం మంగళవారం ప్రకటిం చింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీతో పాటు 15 మందితో ఈ కమిటీని నియమించింది. ఇక కాలేజీల నుంచి ఈ కమిటీలో ముగ్గురికి చోటు కల్పిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఈ కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు కల్పించినట్లు స్పష్టం చేసింది. ఈ కమిటీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. అలాగే ప్రత్యేక ట్రస్ట్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. మూడు నెలల్లో ఈ కమిటీ నివేదిక అందజేయాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోలో స్పష్టంగా సూచించింది. అలాగే విద్యా సంస్థలు స్పష్టం చేసిన సూచనలపై సైతం అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యం, ప్రభుత్వానికి మధ్య దూరం బాగా పెరుగుతోంది. సమయానికి ప్రభుత్వం ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో.. కాలేజీ యాజమాన్యం తమ కళాశాలల బంద్‌కు పిలుపునిస్తుంది. ఆ క్రమంలో కాలేజీ యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. దీంతో వాయిదాల రూపంలో నగదు చెల్లిస్తామంటూ కాలేజీల యాజమాన్యానికి ప్రభుత్వం తెలుపుతోంది. అందుకు ఆ కాలేజీల యాజమాన్యం సానుకూలంగా స్పందించకుండా ఆందోళనలకు దిగింది.

# హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

జర్మనీ బృందానికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ఇందుకు ప్రజాప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. హైదరాబాద్ డ్యుయిష్ బోర్స్ కంపెనీ జీసీసీ ఏర్పాటుతో వచ్చే రెండేళ్లలో ఐటీ రంగంలో వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు సీఎంకు వివరించింది. హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని, హైదరాబాద్‌లో జర్మనీ టీచర్లను నియమించి తెలంగాణ విద్యార్థులకు జర్మనీ భాషను నేర్పించేందుకు సహకరించాలని జర్మనీ బృందాన్ని సీఎం కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని, ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగంలో జర్మనీ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వీటితో టామ్ కాం ద్వారా వొకేషనల్ ఎడ్యుకేషన్, స్కిల్ వర్క్ విషయంలో శిక్షణ అందించేందుకు సహకరించాలని కోరారు.

ఈ భేటీలో అమిత దేశాయ్, డ్యుయిష్ బోర్స్ సీఐవో/సీవోవో డాక్టర్ క్రిస్టోఫ్ బోమ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసింది. దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో మూడు నెలల్లోగా విచారించి నిర్ణయం వెల్లడించాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో నలుగురు ఎమ్మెల్యే విచారణను పూర్తిచేసిన స్పీకర్.. తాజాగా ఈ నెల 6 నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ అనర్హతపై విచారణ చేపట్టనున్నారు. నవంబర్ 6న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లను విచారిస్తారు. ఈ నెల 7న పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీని విచారించనున్నారు. 12న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లపై రెండోసారి విచారణ కొనసాగనుంది.. 13న పోచారం, ఆరికెపూడి గాంధీల పిటిషన్లపై మరోసారి విచారణ నిర్వహిస్తారు. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు గత నెల 31న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును కోరింది. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని దేశ అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది. 6వ తేదీన భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లను విచారించనున్నారు. 13న కామారెడ్డి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేసు విచారించనున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి బీఆర్ఎస్‌కు సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని జూలై 31న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు.

# రేవంత్.. ఫీజు బకాయిలు అడిగితే విద్యార్థులను బెదిరిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రెసిడెంట్ కె.టి. రామారావు కాంగ్రెస్పై విరుచుకు పడ్డారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంకే జరుగుతున్న ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమాజి గూడలో నిర్వహించిన భారీ రోడ్‌షోలో కేటీఆర్ మాట్లా డుతూ, ఫీజు రియంబర్స్మెంట్ పథకంపై ఆధారపడిన వేలాది కుటుంబాల ఆశయాలను నాశనం చేసి, తెలంగాణ విద్యావంతులైన యువతను బలహీనపరిచే ందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ధ్వజమెత్తారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా, మనుగడ కోసం పోరాడుతున్న ప్రైవేట్ కళాశాలలు, విద్యా సంస్థలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందని కేటీఆర్ అన్నారు. "బకాయిలు చెల్లించకపోవడం ద్వారా దళిత, ఆదివాసీ, బహుజన, పేద అగ్రకుల విద్యార్థులను విద్యకు



దూరం చేస్తున్నారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు, అణగారిన వర్గాల ఆశలను అణిచివేసేందుకు పన్నిన పన్నాగం" అని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న డొల్ల మాటలను ఎద్దేవా చేస్తూ, "విద్యార్థుల ఫీజులు కూడా చెల్లించలేని ముఖ్యమంత్రి, జూబ్లీహిల్స్ ప్రజలకు మాత్రం ఏం చేయగలరు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి కూడా విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనలో నిర్వీర్యమైందని ఆయన గుర్తు చేశారు. "వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి, సంస్థలను బెదిరించి భయాందోళనలు సృష్టిస్తున్నారు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. వృద్ధులకు 4,000 పెన్షన్, కోడళ్ళకు 2,500 భత్యం, యువతులకు స్కూటర్లు, రైతులకు 15,000 సాయం, 2 లక్షల రుణమాఫీ, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలన్నీ ఏమయ్యాయి? ఒక్కటీ నెరవేరలేదు" అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్లు, బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్ కానుకలు వంటి అన్ని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని, హైదరాబాద్‌లో ఉచిత నీటి సరఫరా పథకాన్ని కూడా ఆపివేసిందని ఆయన అన్నారు. "భార్యలకు ఉచిత బస్సు ప్రయాణం అంటారు, కానీ భర్తలకు మాత్రం టికెట్ ధరను రెట్టింపు చేశారు. ఇదేనా వాళ్ళు చెప్పే సంక్షేమం?" అని చురక అంటించారు.

కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయని కేటీఆర్ గుర్తు చేస్తూ, 2014కి ముందు నగరంలో కరెంటు కోతలు, నీటి కొరత తీవ్రంగా ఉండేవని అన్నారు. "ప్రతి ఇంట్లో ఇన్వర్టర్ ఉండేది, ప్రతి వేసవిలో నీటి కొరత తప్పేది కాదు. కానీ, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక, తెలంగాణ నిరంతర విద్యుత్, స్వచ్ఛమైన తాగునీరు, వేగవంతమైన పట్టణాభివృద్ధికి నమూనా రాష్ట్రంగా మారింది. 3 లక్షల నుంచి 10 లక్షల ఐటీ ఉద్యోగాలు సృష్టించాం, పరిశ్రమలను విస్తరించాం, శాంతిభద్రతలను కాపాడాం" అని ఆయన వివరించారు.

"ఇది సాధారణ ఎన్నిక కాదు, కారు కు, బుల్డోజర్ కు మధ్య జరుగుతున్న పోరాటం. బుల్డోజర్ ప్రభుత్వాన్ని ఆపడానికి ప్రజలు కారు గుర్తుకే ఓటు వేయాలి" అని స్పష్టం చేశారు. మోసపోయిన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరపున కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడానికి ఈ ఉప ఎన్నికను ఉపయోగించుకోవాలని కేటీఆర్ జూబ్లీహిల్స్ ఓటర్లను కోరారు. భారీ కరతాళ ధ్వనుల మధ్య తన ప్రసంగాన్ని ముగిస్తూ, కేటీఆర్, "ఈ ఎన్నిక పదేళ్ల అభివృద్ధికి, రెండేళ్ల గందరగోళానికి మధ్య జరుగుతున్న పోరాటం. తేడా ఏంటో ప్రజలు చూశారు. ఇప్పుడు తెలంగాణ భారాసతో ముందుకు సాగాలా లేక కాంగ్రెస్‌తో వెనక్కి వెళ్లాలా అని నిర్ణయించుకోవాల్సిన సమయం వచ్చింది. నవంబర్ 11న కారు గుర్తుకు ఓటు వేసి, తెలంగాణ భవిష్యత్తును రక్షించండి" అని పిలుపునిచ్చారు.

# జూబ్లీహిల్స్‌లో 30వేలతో గెలుపు..!

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలి. ఆడబిడ్డ ఎవరికైనా ఆడబిడ్డనే.. నీ సొంత చెల్లెలి కి వాటా ఇవ్వాల్సి వస్తుందని చెల్లిని బయటకు పంపిన కసాయి కేటీఆర్ కాదా.. అని కెటిఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. సొంత చెల్లెల్ని బయటకు గెంటేసి నీచుడు కేటీఆర్..మీ సొంత అన్న ఇట్లనే అవమానిస్తే.. ఊరుకుంటారా..? వేలకోట్లు కొల్లగొట్టుకున్న వ్యక్తి కేటీఆర్.. పావలా వంతు అయినా.. చెల్లికి ఇవ్వచ్చు కదా.. మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడుతున్నాడు.. ఐదేళ్లు మంత్రి పదవులు ఇవ్వకుండా అవమానించినది నువ్వు కాదా..? ఇందిరాగాంధీ దేశాన్ని కాంగ్రెస్ పార్టీ నీ నడపలేదా.. సోనియా గాంధీ.. ప్రియాంక గాంధీ కాంగ్రెస్ నీ నడపడం లేదా..? పదేళ్లలో ఈ పనికి మాలిన వాడు రేషన్ కార్డు ఇచ్చాడా.. ఫార్మ్ హౌస్ లో మీరు ఏమైనా వాటా అడిగారా..? రేషన్ కార్డు ఒక్కటే కదా మీరు అడిగిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. మీతోనే నిరంతరం ఉండే నవీన్ యాదవ్ గెలిస్తే మీ వెంటే ఉండి సమస్యలు పరిష్కరిస్తాడని అన్నారు.

# అకాల వర్షంతో తడిసిపోయిన పత్తి, వరిధాన్యం



(మొదటి పేజీ తరువాయి)

వర్షాలు కురవడంతో లోతట్టుప్రాంత ప్రజల్లో ముంపు భయం నెలకొంది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల్, మేడ్చల్ – మల్కాజిగిరి, యాదాద్రి – భోంగీర్ వంటి పశ్చిమ, మధ్య, దక్షిణ తెలంగాణలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడుతాయని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, జనగాం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులతో కలిసి జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 11వ డివిజన్ పోతన నగర్‌లో క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించారు. నాళాల భౌతిక స్థితి పరిశీలించి, వరద నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల సూచించారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పలుచోట్ల జల్లులు కురిసాయి. రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కుస్తాయనివాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్, నల్లగొండతోపాటు పలు జిల్లాల్లో భారీ వాన కురుస్తున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉదయం భారీ వర్షం పడింది. సుమారు అరగంటపాటు ఈదురు గాలులతో కూడిన వాన కుండపోతగా కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. ఇక నల్లగొండ జిల్లాలో భారీ వర్షం కురుస్తున్నది. అరేబియా సముద్రం నుంచి తెలంగాణ వైపు తేమ గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం నుంచి పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

# వ్యవసాయం మనజీవన విధానంలో భాగం

(మొదటి పేజీ తరువాయి)

54 శాతం జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పుకొచ్చారు. వ్యవసాయ రంగం దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉందని వివరించారు. అగ్రి బిజినెస్ అవార్డులు ఇవ్వడం ద్వారా భారతదేశ వ్యవసాయ రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న రైతులకు, ఇన్నోవేటర్స్, అగ్రిప్రెన్యూర్స్‌ని గౌరవించు కోవడమేనని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్‌లో అగ్రి బిజినెస్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బలంగా నమ్ముతారని నొక్కిచెప్పారు. అందుకే అనేక పథకాలు రైతులకు మేలు చేసేలా రూపొందించారని తెలిపారు. ఈ ఏడాది చైనాను దాటేసి 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో భారతదేశం ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచిందని ఉద్ఘాటించారు. 2014 నుంచి 2015 మధ్యలో పాల




ఉత్పత్తి 63 శాతం పెరిగిందని చెప్పు కొచ్చారు. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే దేశంగా మనం నిలిచామని పేర్కొన్నారు. ఆత్మ నిర్భర భారత్ దిశగా దూసుకెళ్లేందుకు వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఉద్ఘాటించారు. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచలోనే తొలిస్థానంలో నిలిచామని వివరించారు. దేశంలో 26 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా విషయంలో ఎన్ని ఇబ్బందులు తలెత్తినా ఆహార ధాన్యాలు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేరే దేశాలకు కూడా భారతదేశం నుంచి ఎగుమతి చేశామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలోని 80 కోట్ల మందికి ఉచితంగా 5 కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్, పీఎం కృషి సించాయి యోజన వంటి అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి. 2019లో పీఎం సమ్మాన్ నిధి యోజన ప్రారంభించినప్పటి నుంచి 11.8 కోట్ల మంది రైతులకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా రైతులకు భరోసా దక్కిందని నొక్కిచెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు లబ్ది పొందుతున్నారని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు వరి ధాన్యం కనీస మద్దతు ధర భారీగా పెంచామని వెల్లడించారు. జీఎస్టీ 2.0 ద్వారా రైతులకు ఉపయోగపడేలా ట్రాక్టర్లు, మెషీన్లపై భారీగా జీఎస్టీ తగ్గించామని ప్రకటించారు. జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పుకొచ్చారు. సాగు ఖర్చు కూడా భారీగా తగ్గి, రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి అగ్రి టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.




## కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం

**రాష్ట్ర యువజన అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి**

**ఎల్ బి నగర్, నవంబర్04 (వార్త వేదిక సూర్య):** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోరుతూ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో యూసఫ్ గూడ డివిజన్ పలు కాలనీల్లో జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివ సేన రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, పలు జిల్లాల నియోజకవర్గాల, డివిజన్ ల అధ్యక్షులు, కార్యకర్తలు యువత మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అక్షర హైస్కూల్లో ట్రస్మా ఆధ్వర్యంలో అట్టహాసంగా క్రీడా పోటీలు

**ధంతాలపల్లి నవంబర్ 04 (వార్త వేదిక సూర్య):** మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలోని స్థానిక అక్షర హైస్కూల్లో జరిగినటువంటి ట్రస్మా ప్రైవేట్ విద్యాలయాల క్రీడా పోటీల్లో వివిధ క్రీడాంశాలు కబడ్డీ ,కోకో జూనియర్ సీనియర్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దంతాలపల్లి



మండలంలోని ఆరు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఆతిధ్య పోటీకి దంతాలపల్లి మండలం విద్యాధికారి శ్రీదేవి, ట్రస్మా మండల అధ్యక్షులు సింగరపు యాకయ్య, ట్రస్మాజిల్లా క్రీడ కన్వీనర్ గండి వెంకన్న, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు మైకేల్, బిక్షం, కాటి రాములు తదితరులు పాల్గొన్నారు . ఈ పోటీలను ఫిజికల్ డైరెక్టర్లు అనిల్ ,అరుణ నిర్వహించారు.


## తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా కటుకం ప్రభు ఏకగ్రీవం..

**కోరుట్ల, నవంబర్04 (వార్త వేదిక సూర్య):** ఇటీవల జగిత్యాల టి జి ఆర్ ఈ ఏ నిర్వహించిన ఎన్నికలలో కోరుట్ల వాస్తవ్యులు కటుకం ప్రభు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. ఎన్నికైన ఉపాధ్యక్షులు కటుకం ప్రభు మాట్లాడుతూ. ఇందుకు పూర్తి సహకారం అందించిన కోరుట్ల అధ్యక్షులు ఎస్. ప్రకాష్, రుద్రసుధాకర్, పిన్నంశెట్టి శ్రీనివాస్, వనతడుపుల మురళి, నరసయ్య లకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుతు, తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు, ఎల్లవేళలా అందుబాటులో ఉండి అభివృద్ధికి తోడ్పడుతానని పేర్కొన్నారు.



## బోరబండలో పోచంపల్లి బి.ఆర్.ఎస్. నాయకుల ప్రచారం

**భూదాన్ పోచంపల్లి, నవంబర్04 (వార్త వేదిక సూర్య):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ను గెలిపించాలని కోరుతూ మంగళవారం బోరబండ డివిజన్ (బూత్ 330) లో పోచంపల్లి మండల బిఆర్ఎస్ నాయకులు ఇంటింటికి తిరిగి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అరాచకాలు అరికట్టాలంటే బిఆర్ఎస్‌కు ఓటు వేయాలని, ప్రజా వ్యతిరేక



విధానాలే బిఆర్ ఎస్ పార్టీకి గెలుపుకు సోపానమని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి , పోచంపల్లి పిఏసిఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి , మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు ముత్యాల మహిపాల్ రెడ్డి, పగిళ్ల సుధాకర్ రెడ్డి, నాయకులు సిద్దగోని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.








# తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం...

### తేమ శాతం ఉన్న పత్తిని తక్షణమే కొనుగోలు చేయాలి : యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

**యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబర్04 (వార్త వేదిక సూర్య):** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలోలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, తేమ వచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు.

మంగళవారం ఆలేరు మండలం కొలనుపాకలో ఐ.కే .పి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ...కొనుగోలు కేంద్రంలో ఈరోజు కురిసిన వర్షానికి ధాన్యం ఏమైనా తడిసిందా అని అడిగి తెలుసుకున్నారు.రైతులందరూ కలిసి ఎల్లపుడు అప్రమత్తంగా ఉండాలని ఈ అకాల వర్షాలు ఎప్పుడు వస్తాయో తెలవని పరిస్థితి ఉందన్నారు. ధాన్యం కుప్పలను టార్పాలిన్స్ కవర్లతో కప్పి ఉంచాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు అని అడిగారు.కొనుగోలు చేసినంత వరకు ట్యాబ్ ఎంట్రీ పూర్తి అయిందా అని అడిగి ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. నిర్వాహకులు రోజు తేమశాతం చెక్ చేసి వచ్చిన ధాన్యం కుప్పలను కాంటా వేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో వచ్చే సీజన్ వరకు రైతులు సేద తీరేందుకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని స్థానిక తహసీల్దార్‌కు తెలిపారు. అనంతరం ఆలేరు మండలం కొల నుపాక గ్రామంలో లోలెవల్ బ్రిడ్జిపై నుండి వెళ్లే వరద ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బ్రిడ్జిని పరిశీలిస్తూ వరద ప్రవాహం వల్ల బ్రిడ్జి దెబ్బతినడంతో వాహన దారులు ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి కాబట్టి కొత్త బ్రిడ్జి పూర్తి అయ్యేలోపు ప్రక్క నుండి కంకర మొరం పోసి లెవల్ చేసి పయనించే విధంగా వెంటనే మరమ్మతులు చేయాలని, గుంతలు ఉన్న చోట తక్షణమే గుంతలు పూడ్చాలని జిల్లా కలెక్టర్ కాంట్రాక్టర్ ని ఆదేశించారు. తదుపరి ఆలేరు మండల కేంద్రంలో సి సి ఐ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. సీసీఐ కొనుగోలు కేంద్రాలు తేమ శాతం సరిగా చూడాలన్నారు. ఈరోజు ఎంత మంది రైతులు పత్తి తీసుకొని వచ్చారని అడిగి తెలుసుకున్నారు. అందులో ఎంత తేమ శాతం వచ్చింది అని అడిగారు.మిల్లుల్లో ఉన్న పత్తి తేమశాతం పరిశీలించారు. కొన్ని సార్లు మిషన్ ప్రాబ్లం వలన కూడా తేమ శాతం ఎక్కువ చూపెడుతుందన్నారు, కాబట్టి ఎక్కువ తేమ శాతం వచ్చిన పత్తిని మళ్లీ ఒకసారి చూసి కొనుగోలు చేయాలని తెలిపారు.సిసీఐ కొనుగోలు నిర్వాహకులు రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.

# పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

**- పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమం తప్పదు.**

**- ఎస్ఎఫ్ఐ ద్వారా ప్రభుత్వానికి హెచ్చరిక.**

**- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడి.**

**- విద్యార్థులను సర్టిఫికేట్స్ సందర్భంగా వేదింపులు గురి చేసే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి.**

**చెన్నూర్, నవంబర్04 (వార్త వేదిక సూర్య):** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్ షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలనీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చెన్నూర్ ఎమ్మెల్యే, మంత్రి క్యాంప్ ఆఫీస్ ముందు ధర్నాతో పాటు వినతిపత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు, గతంలో అనేక కార్యక్రమాలు నిర్వహించినప్పటికి ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందించలేదు. విద్యార్థులు, తల్లితండ్రులు రోడ్డెక్కి నిరసనలు చేస్తున్న ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుంది. తక్షణమే రాష్ట్రంలో పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి ఈదునూరి అభినవ్ మాట్లాడుతూ.. దసరా ముందు యాజమాన్యలకు ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా కనీసం రూ 1200 కోట్లు విడుదల చేయాలి. ఈ బకాయిలు ఉన్నాయనే పేరుతో ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. సర్టిఫికెట్స్ అడిగితే ముందు విద్యార్థులకు డబ్బులు చెల్లిస్తేనే ఇస్తామని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలి, ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు వేధిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ యూనివర్సిటీలు, కళాశాలలు కూడా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు పేరుతో ముందుగానే ఫీజులు కట్టాలని తీవ్ర ఒత్తిడి తెచ్చి, ప్రభుత్వ విద్యాసంస్థలలో కూడా ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డి.బి.టి) పేరుతో విద్యార్థుల అకౌంట్ లలో నిధులు వేస్తున్నారు. వాటిని చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. అందుకే ప్రభుత్వం ఫీజులపై స్పష్టంగా నిర్ణయించి పాత బకాయిలు విడుదల చేయాలి. మానుకోవాలి. కేవలం ఫీజులు మాత్రమే కాకుండా బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు, డైట్ ఛార్జీలు బకాయిలు, కాస్మొటిట్ చార్జీలు బకాయిలు, గురుకులాలకు కాంట్రాక్టు పద్ధతిలో ప్రొవిజనల్స్



రాష్ట్ర స్కాలర్ షిప్స్ ప్రభుత్వ బిక్ష కాదు రాజ్యాంగం కల్పించిన హక్కు వాటిని సాధించుకునేందుకు జిల్లాలో గత ప్రభుత్వం హయాంలో 10,400 కోట్లు పెండింగ్ లో నిధులు ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 23 నెలలు కావస్తున్న పెండింగ్ నిధులు విడుదల చేయలేదు. మొత్తం 10 వేల 400 కోట్ల నిధులు బకాయిలు పేరుకుని పోయాయి.

విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ఈ అంశంపై కనీసం పట్టించుకోవటం లేదు. కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. 14 లక్షల ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల, మైనార్టీ వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే చర్యలు అందించే వారికి బకాయిలు విద్యారంగం మొత్తం అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలి. యూనివర్సిటీల హాస్టల్స్ బకాయిలు కూడా విడుదల చేయలేదు. తక్షణమే విద్యారంగానికి సంబంధించిన అన్ని బకాయిలు విడుదల చేయాలని, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా సభ్యుడు రాజకుమార్, నిఖిల్, మంచిర్యాల టౌన్ కార్యదర్శి హర్షవర్ధన్, సభ్యులు రాంచరణ్, సాయికిరణ్, విష్ణుప్రసాద్, చెన్నూర్ మండల సభ్యులు అంజన్న, ప్రణయ్, దీపక్, వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజు కొనసాగిన కళాశాలల నిరవధిక బంద్

**ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చిన యాజమాన్యాలు**

**యాదాద్రి భువనగిరి బ్యూరో,నవంబర్04 (వార్త వేదిక సూర్య):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ మరియు పీజీ కళాశాలల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం చేపట్టిన నిరవధిక బంద్ రెండవ రోజున కూడా కొనసాగింది. ఈ సందర్భంగా నేడు వినాయక చౌరస్తా నందుగల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ప్రైవేట్ డిగ్రీ మరియు పీజీ కళాశాలల యాజమాన్యాలు వినతిపత్రం సమర్పించారు. మరియు అలాగే భువనగిరి నియోజకవర్గం శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ గారికి వినతి పత్రం అందజేసినారు.

ఈ సందర్భంగా తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల అసోసియేషన్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధి అసోసియేట్ ప్రెసిడెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ "రెండవ రోజు కూడా బంద్‌లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేట్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలు పాల్గొన్నాయి అని, ఈ రోజు మేము డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించడం ద్వారా విద్యా హక్కు కోసం మమ్మల్ని గౌరవించేలా ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం" అని తెలిపారు.

శ్రీ నవభారత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వం



విద్యార్థుల భవిష్యత్తు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, ప్రైవేట్ కళాశాలల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని, తక్షణమే బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల అసోసియేషన్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధి అసోసియేట్ ప్రెసిడెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్, శ్రీ నవభారత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చిక్క ప్రభాకర్, జాగృతి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మనిపాల్ రెడ్డి మరియు పలు కళాశాలల ప్రిన్సిపల్ లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# న్యాయవాది నిరంతర విద్యార్థిగా ఉండి అధ్యయనాన్ని పెంచుకోవాలి

**గంట విద్యాసాగర్ రెడ్డి ప్రముఖ సీనియర్ న్యాయవాది పిలుపు**

**న్యాయ విజ్ఞాన సదస్సును ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు**

**యాదాద్రి భువనగిరి బ్యూరో, నవంబర్04 (వార్త వేదిక సూర్య):** బార్ అసోసియేషన్, ఆలిఇండియా లాయర్స్ యూనియన్ ఐలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు ప్రారంభించారు. న్యాయవాది నిరంతర విద్యార్థిగా ఉంటూ అధ్యయనాన్ని పెంచుకోవాలని సదస్సు ముఖ్య అతిథి న్యాయవాది గంట




విద్యాసాగర్ రెడ్డి అన్నారు. భువనగిరి బార్ అసోసియేషన్ హాల్లో జరిగిన ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ మరియు 2023లో వచ్చిన భారతీయ సాక్ష్య అభినయం బి ఎస్ ఏ కొత్త చట్ట సవరణ మార్పులపై సెక్షన్లపై మరణ వాంగ్మూలం, మర్డర్ ,రేప్ కేసు,లలో పోలీస్ యంత్రాంగం నేరస్థులపై తప్పుడు కేసులను ఎల అభియోగ మోపుతున్నారో అదేవిధంగా ఓరల్,ఎలక్ట్రానిక్ , డాక్యుమెంట్ , రాతపూర్వక ఎవిడెన్స్ లపై క్లుప్తంగా వివరించారు. ఆలిఇండియా లాయర్స్ యూనియన్ ఐ లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి మాట్లాడారు ఈ కార్యక్రమానికి బోల్లెపల్లి కుమార్ అధ్యక్షత వహించగా ఐలు రాష్ట్ర కోశాధికారి వేణుగోపాలరావు, ఐ లు రాష్ట్ర నాయకులు నాగారం అంజయ్య,జిల్లా గౌరవ అధ్యక్షులు కుక్క దువ సోమయ్య, గోధ వెంకటేశ్వర్లు ఎండి నేహాల్ బొడ్డు కిషన్, చేగురి ఐలయ్య జిట్టా భాస్కర్ రెడ్డి,సిహెచ్ సిద్ధిరాములు భూపాల్ రెడ్డి, రాజిరెడ్డి, బొమ్మ వెంకటేష్, పల్లె రాంరెడ్డి పిడుగు ఐలయ్య ఆకుల మల్లేశం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల స్థలాలు కేటాయిస్తాం : ఆర్డీవో

**మోత్కూరు, నవంబర్04 (వార్త వేదిక సూర్య):**

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లకు, ఇళ్ల స్థలాలు లేని లబ్ధిదారులకు ఫేస్-2లో స్థలాలు కేటాయించి ఇండ్ల నిర్మాణం చేపడతామని భువనగిరి ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. మంగళ వారం ఆయన మోత్కూరు మున్సిపల్ పరిధిలోని కాశవారిగూడెంలో ఏర్పడిన పరిస్థితులను సమీక్షించారు. సోమవారం ప్రభుత్వ భూమిలో ఆక్రమించుకొని ఇల్లు నిర్మించుకున్న మహమ్మద్ పక్కీర్ అహమ్మద్ కుటుంబానికి చెందిన నిర్మాణాన్ని అధికారులు కూల్చివేయడంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు రహదారిపై రాస్తారోకో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్డీవో కృష్ణారెడ్డి మంగళవారం మోత్కూరు తహశీల్దార్ కార్యాలయంలో కాశవారిగూడెం ప్రజలతో సమావేశమయ్యారు. ఆ కాలనీ ప్రజలు తమ సమస్యలను వివరిస్తూ, నివాస స్థలాలు లేవని, ఇళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ఫేస్-1లో ఇందిరమ్మ ఇండ్లకు అర్హులై, ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ఇప్పటికే ఇండ్లు మంజూరు చేస్తున్నామని, ఫేస్-2లో స్థలాలు లేని అర్హులైన వారికి ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే స్థలాలు కేటాయించి ఇండ్ల నిర్మాణం చేపడతామని అన్నారు. కాశవారి కాలనీలో ఎక్కువ మంది అర్హులు స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారని గుర్తించి, ఈ సమస్య పరిష్కారానికి కలెక్టర్‌తో మాట్లాడతామని ఆయన హామీ



ఇచ్చారు. అదేవిధంగా, కాలనీలోని స్మశాన వాటిక సమస్యపై కూడా చర్యలు తీసుకునేలా కలెక్టర్‌తో చర్చిస్తానని తెలిపారు.

# మద్యంషాపులు జనావాసాల నుండి తీసివేయాలి

## - బండారు నరసింహారెడ్డి

**వలిగొండ, నవంబర్ 4 (వార్తా వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రాలలో గ్రామాలలో జన ఆవాసాలకు కిలోమీటర్ దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేయాలి అవినీతి నిర్మూలన ఐక్య వేదిక వ్యవస్థాపకులు బండారు నరసింహారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు నివాసము ఉండే ప్రాంతాలకు దూరంగా కనీసం ఒక కిలోమీటర్లు దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేయాలి. మద్యం తాగిన తర్వాత మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించే అవకాశం ఉంది. చిన్నపిల్లలపై మద్యం ప్రభావం చూపే అవకాశం ఉంది. యాక్సిడెంట్ జరిగే ప్రమాదం ఉంది. చుట్టుపక్కల ఉండే కుటుంబాలకు అసౌకర్యంగా ఉంటుంది



అందుకని గ్రామానికి కనీసం కిలోమీటర్ దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేయాలి.

అదే సందర్భంలో బెల్టు షాపులను పూర్తిగా నిషేధించాలి. బెల్టు షాపుల వల్ల చాలా ప్రమాదం పొంచి ఉంది ఉదయం 6 గంటలకే బెల్టు షాపులలో తాగి భార్యా పిల్లలతో గొడవపడి ప్రాణాలు తీస్తున్నారు ఇతరులను హత్యలు కూడా చేస్తున్నారు. తాగిన మైకంలో దొంగతనాలు చేస్తున్నారు దోపిడీలు చేస్తున్నారు కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోతున్నాయి ఎమ్మెల్యేలు,ప్రభుత్వం అధికారులు, సరియైన చర్యలు వెంటనే



తీసుకోవాలని కోరారు.

## బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే

# పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించాలి




## సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు

**మోత్కూరు, నవంబర్04 (వార్త వేదిక సూర్య):**

బీసీ రిజర్వేషన్లు అడ్డుకునేది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని, రాజ్యాంగ సవరణతోనే బీసీలకు స్థానిక సంస్థలతో పాటు విద్యా, వైద్యా ఉపాధి రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు అవుతాయని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు అన్నారు. మంగళవారం నాడు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ పార్లమెంట్ లో రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు.బీసీ బిల్లుపై అసెంబ్లీలో మద్దతు తెలపిన బీజేపీ కేంద్రంలో అడ్డుకోవడంలో అంతర్యమేమిటి ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర మంత్రివర్గం ఆర్డినేన్స్ గవర్నర్ ఆమోదనికి పంపిందని ఈ బిల్లును గవర్నర్ ఆమోదించక పోవడం దారుణమన్నారు. గవర్నర్ నాన్చుడు ధోరణి పై రాష్ట్ర ప్రభుత్వం ఈ రిజర్వేషన్లకై జీఓ ను విడుదల చేసిందన్నారు. ఈ జిఓపై హైకోర్టు స్టే విధించిందని, సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వ అప్పీలు కొట్టివేసిందని తెలిపారు. ఇప్పటికైనా బీసీ రిజర్వేషన్లపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కురిమేటి యాదయ్య, పానుగుళ్ల రమేష్, పిట్టల చంద్రయ్య, దడిపల్లి సైదులు పాల్గొన్నారు.



## పాటిమట్ల ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని పూర్తి చేయాలని

# సి.ఎస్ ఓ.ఎస్ డి. విద్యా సాగర్ వినతి

**మోత్కూరు,నవంబర్04(వార్త వేదిక సూర్య):**

మోత్కూరు మండలం పాటిమట్లలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల నిధులు విడుదల చేసి ఈ పనులను ఏడాదిన్నర క్రిందట స్థానిక శాసనసభ్యులు మందుల సామేల్ శంకుస్థాపన కూడా చేశారని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్ తెలిపారు. ఈ భవనానికి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి ఏడాది దాటిన భవనం నిర్మాణం పూర్తి చేయకుండా నిలిపివేశారని ఈ పనులను వెంటనే మరమ్మత్తులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంగళ వారం నాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఓ .ఎస్. డి విద్యాసాగర్ కు మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములుతో కలిసి శాంతి కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఉన్నప్పటికి ప్రజలకు ఏదైనా అత్యవసర ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు భువనగిరి, నల్లగొండ, హైదరాబాద్, సూర్యాపేట ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే మరమ్మతులు చేయుటకు కృషి చేయాలని విద్యాసాగర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు శాంతి కుమార్ తెలిపారు.

## ఈ నెల 7న ఇందిరా పార్క్ వద్ద జరిగే

# నిరసన దీక్షను విజయవంతం చేయాలి

**మోత్కూరు, నవంబర్04 (వార్త వేదిక సూర్య):**

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బి. యాదిరెడ్డి ప్రధాన కార్యదర్శి ఏ. వల్లభాయి కోరారు. మంగళవారం నాడు ఈ మేరకు విశ్రాంత ఉద్యోగుల సమస్యల సాధన కొరకు ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఈ నెల7 న నిర్వహించనున్న నిరసన దీక్ష వాల్ పోస్టర్లను స్థానిక సంఘం కార్యాలయ భవనంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్య చికిత్స పథకాన్ని అమలు చేయాలని, ఇటీవల రిటైర్ అయినట్టువంటి ఉద్యోగులకు రిటైర్మెంట్ ప్రయోజనాలను ఒకేసారి డబ్బులు వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిల డిఏలను వెంటనే చెల్లించాలని, పి.ఆర్సీని వెంటనే అమలు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కోశాధికారి వారాల యాదగిరి, ఉపాధ్యక్షులు తొగిటి మనోహరాచారి, ప్రచార కార్యదర్శి బయ్యని వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు సూరోజు భాస్కరాచారి, ఆవిశెట్టి ఆవిలిమల్లు, కలిమెల నర్సయ్య ఏ. సుధాకర్ రెడ్డి, ఏ. సత్తయ్య, , సి. బిక్షం,ఎస్. యాదగిరి పాల్గొన్నారు.






# అకాల వర్షాలతో.. రైతాంగం ఆందోళన..

**మోత్కూరు, నవంబర్ 04 (వార్తా వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా అడపా, దడపా కురుస్తున్న మోస్తరు వర్షాలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవలే సంభవించిన మోంథా తుఫాన్ ప్రభావంతో ధాన్యం, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిని ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో మళ్లీ వర్షాలు పడటం రైతులను మరింతగా ఇబ్బందులకు చేస్తుంది. ఈ ఏడాది మొదట్లో వర్షాలు లేక ఇబ్బందులు పడ్డ రైతులు.. గత మూడు నెలలుగా కురుస్తున్న వర్షాలు తమను పూర్తిగా ముంచేశాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతకు వచ్చిన పంటలు పొలాలల్లోనే తడిసి పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. వరికోత పనులు నిలిచిపోవడంతో



చైన్ మిషన్లు కూడా ఎక్కడికక్కడే నిలిచిపోయాయని తెలిపారు. పత్తి పంట నష్టం ... వరి పంటతో పాటు. పత్తి కూడా ఇంటికి చేర్చుకోలేని పరిస్థితితో తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు.

# ఈ నెల 15న ప్రత్యేక లోక్ అదాలత్

## ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష

**రామన్నపేట, నవంబర్ 04(వార్తా వేదిక సూర్య):** ఈ నెల 15న నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకునేలా, పరిష్కార మార్గం చూపాలని రామన్నపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శిరీష సమన్వయ సమావేశం నిరహించారు. ఈ సమావేశంలో జడ్జీ కిమాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా అన్ని విభాగాల అధికారులు, న్యాయవాదులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పని




చేయాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడానికి కక్షిదారులకి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. వేంకటేశ్వర్లు, రామన్నపేట ఎస్ఐ డి.నాగరాజు, వలిగొండ ఎస్సై వి.యుగేందర్ గౌడ్, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి దేవాలయంలో

# కార్తీక మాసం ప్రత్యేక పూజలు

**మోత్కూరు, నవంబర్04 (వార్త వేదిక సూర్య):**

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని మంగళవారం పురోహితుడు పారునంది లక్ష్మణమూర్తి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆవు పేడ,మారేడు ప్రతులతో చేసిన



శివలింగానికి భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ కి చెందిన బట్టు సత్యనారాయణ బిబిరజిత దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బైరు యాక స్వామి, తవిటి హరినాథ్, దబ్బేటి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని పరిశీలించిన ఆర్డీవో

**మోత్కూరు, నవంబర్04 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సింగిల్ విండో ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం నాడు భువనగిరి ఆర్డీవో ఎం కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యంతో తేమశాతం రాక రైతులు త్రీవ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కానీ...., ప్రభుత్వ నిబంధన ప్రకారం తేమా శాతం ఉన్న ధాన్యాన్ని తక్షణమే



తూకాలు వేసి మిల్లులకు తరలించాలని సింగిల్ విండో సీఈవో వరలక్ష్మిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహశీల్దార్ పి.జ్యోతి, ఆర్.ఐ. సుమన్, ఏవో కీర్తి, మార్కెట్ సిబ్బంది శ్రీకాంతాచారి తదితరులు ఉన్నారు.

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY








హైదరాబాద్: మాజీ మంత్రివర్యులు, బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన నేపథ్యంలో సుదర్శన్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛన్ని అందజేశారు జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్.



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హరీష్ రావు గారి తండ్రి సత్యనారాయణ రావు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్. వెంట హైకోర్టు సీనియర్ న్యాయవాది రవీందర్ రావు ఉన్నారు.

# మిర్యాలగూడ కిడ్జీ స్కూల్‌లో అమెరికా తరహా హాలోవీన్ ఫెస్టివల్ సంబరాలు

మిర్యాలగూడ ప్రతినిధి, నవంబర్ 4 (వార్తా వేదిక సూర్య):
నల్గొండ జిల్లా.... మిర్యాలగూడ లోని విద్యానగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీ డిసైడ్ ఓల్డ్ బిఎల్ఆర్ అపార్ట్మెంట్ గలకిడ్జీ స్కూల్‌లో హాలోవీన్ పేస్ట్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. సాధారణంగా ఈ ఫెస్టివల్ అమెరికాలోనే జరుపుకునే సంప్రదాయం ఉన్నప్పటికీ,భారతదేశంలో తొలిసారిగా మన తెలంగాణలోని మిర్యాలగూడలోని కిడ్జీ స్కూల్‌లో ఈ వేడుకను అద్భుతంగా, ఆహ్లాదకరంగా నిర్వహించడం విశేషం.





చిన్నారులు వివిధ దేశాల సాంస్కృతిక ప్రతీకలను ప్రతిబింబించేలా పలు వేషధారణల్లో పాల్గొని ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. భూతాల వేషాలు, కార్టూన్ పాత్రలు, పుష్పాలు, పండ్లు, జంతువులు, వీరభావాలు, దేశభక్తి ప్రతీకలతో పిల్లలు ప్రదర్శించిన సృజనాత్మకత అందరినీ ఆశ్చర్యపరిచింది. చిన్నారుల ఆత్మవిశ్వాసం, ఆనందం స్కూల్ ప్రాంగణాన్ని ఉత్సవ వాతావరణంగా మార్చింది. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడిన స్కూల్ కరస్పాండెంట్ ఉత్తేష్ మాట్లాడుతూ.. పిల్లలలో సృజనాత్మకత, ధైర్యం, ప్రపంచ సంస్కృతుల పట్ల అవగాహన పెంపొందించడానికి ఈ హాలోవీన్ ఫెస్టివల్ ఎంతో ఉపయోగకరం. అమెరికాలో మాత్రమే జరిగే ఈ వేడుకను మన మిర్యాలగూడలో నిర్వహించడం గర్వకారణం" అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు. రంగురంగుల వేషాలు, చిన్నారుల హావభావాలు, మధురమైన నవ్వులు స్కూల్ ప్రాంగణం మొత్తాన్ని ఆనందభరితంగా మార్చాయి. అలాగే మా కిడ్జీ స్కూల్లో అడ్మిషన్స్ కూడా జరుగుతున్నాయి అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు ఫోన్ 7989043138.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

**- బట్టు జగన్ యాదవ్**

నాంపల్లి నవంబర్ 04(వార్త వేదిక సూర్య):
నల్గొండ జిల్లా నాంపల్లి మండలం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ నీ గెలిపించాలని చామలా కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డి గుడాలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి పాల్గొన్న జగన్ యాదవ్ మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ అగ్రనేత శ్రీ.రాహుల్ గాంధీ గారి మార్గదర్శకత్వంలో, సీఎం రేవంత్ రెడ్డి గారి చిత్తశుద్ధితో బిసి లని గుర్తించి నవీన్ యాదవ్ కి టికెట్ ఇచ్చారని బిసిల నిజమైన నాయకత్వం కాంగ్రెస్ తోనే



సాధ్యం అన్నారు సమానత్వం, న్యాయం, స్వాభిమానం ఈ మూడు విలువలతోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందన్నారు.దళిత, బిసి,యువతకు విద్య, ఉపాధి, గృహనిర్మాణం, స్వయం ఉపాధి రంగాల్లో ప్రత్యేక పథకాలు అమలవుతున్నాయని వివరించారు బిసిల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలు అందరూ ఐక్యంగా నిలబడి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ నవీన్ కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. నవీన్ యాదవ్ యువ నాయకుడు, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన విజయం రేవంత్ రెడ్డి చేపట్టిన బిసి దళిత సంక్షేమ దిశకు ప్రజల మద్దతు సూచికగా నిలుస్తుందని అన్నారు.బిసి,దళితుల గౌరవం కోసం ఓటు వేసి. నవీన్ యాదవ్‌నే గెలిపించండి" పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ గౌడ్, మహేష్, అశోక్ సింగ్, మోహన్ యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల సొమ్ము అగ్రవర్ణం ఖర్చు చేస్తున్నారు

**• అగ్రవర్ణ నాయకులు బీసీ రాజ్యాధికారానికి అడ్డుపడుతున్నారు : తీర్మార్ మల్లన్న • నల్లగొండలో ఓపెన్ టాక్ విత్ మల్లన్న**

నల్లగొండ, నవంబర్ 4 (వార్తా వేదిక సూర్య):
నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఆర్ గార్డెన్లో బీసీ జేఏసీ, ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఓపెన్ టాక్ విత్ మల్లన్న కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కన్వీనర్ వట్టే జానయ్య నేతృత్వంలో ఈ కార్యక్రమం కొనసాగింది.ఉమ్మడి జిల్లాల ఇంటెలెక్చువల్ ఫోరం సభ్యులు,మేధావులు,విద్యార్థి నాయకులు,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు తీన్మార్ మల్లన్నకు నేరుగా ప్రశ్నలు అడగగా,మల్లన్న అన్ని ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇచ్చారు.

**బీసీలే రాజ్యాధికారానికి బలం..**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బీసీల ఏకతతోనే తెలంగాణలో కొత్త రాజకీయ దిశ ఏర్పడుతుంది. టిఆర్పి పార్టీ వ్యక్తుల కోసం కాదు, మహనీయుల ఆశయాల సాధన కోసం పుట్టిందన్నారు.విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం 20శాతం బడ్జెట్ కేటాయిస్తామని, ప్రభుత్వ పాఠశాలల స్థితిని పూర్తిగా మార్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పేదల పిల్లల భవిష్యత్తు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంది.కానీ ప్రస్తుత ప్రభుత్వం వాటిపై శ్రద్ధ చూపడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**విద్య,వైద్యం ప్రభుత్వ హస్తాల్లోనే 40 శాతం బడ్జెట్ హామీ..**

టిఆర్పి ప్రభుత్వం వస్తే విద్యా, వైద్య రంగాలపై 40 శాతంబడ్జెట్ కేటాయిస్తామన్నారు.నారాయణ,శ్రీ చైతన్య వంటి కార్పొరేట్ సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చేశాయి.టిఆర్పి ప్రభుత్వం ఈ రంగాలను





పూర్తిగా ప్రభుత్వ పర్యవేక్షణలోకి తీసుకువస్తుందన్నారు.తెలంగాణ చరిత్ర,సాయుధ పోరాట గాథలను పాఠ్యాంశాల్లో తప్పనిసరిగా చేర్చుతామని,6,7, 8,10వ తరగతుల్లో తెలంగాణ పోరాట చరిత్ర బోధన ప్రత్యేకంగా ఉంటుందని వెల్లడించారు.

**జనాభా నిష్పత్తి మేరకు టికెట్లు బీసీ సబ్‌ప్లాన్ రూపకల్పన..**

టిఆర్పి ప్రభుత్వం వస్తే జనాభా దామాషా ప్రకారం టికెట్ ఇస్తాము. బీసీలకు 42శాతం రిజర్వేషన్ చట్టసభల్లో,
ఉద్యోగాల్లో తప్పని సరి చేస్తాం. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ అంశాన్ని నిర్లక్ష్యం చేసిందని,జానారెడ్డి వంటి అగ్రవర్ణ నాయకులు బీసీ రాజ్యాధికారానికి అడ్డుపడుతున్నారని విమర్శించారు. ప్రతి ఏడాది బీసీల అభివృద్ధికి లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించి,ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్‌ల మాదిరిగా బీసీ సబ్‌ప్లాన్ రూపొందిస్తామని తెలిపారు.
మహనీయుల ఆశయాల దిశగా టిఆర్పి అడుగులు..

మా పార్టీ జెండాపై మహనీయుల ఫోటోలు ఉండవు,మా గుండెల్లో ఉంటాయి.అంబేద్కర్,పూలే, పీరాల ఆశయాల దిశగా టిఆర్పి పార్టీ నడుస్తుంది. ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు జూమ్ మీటింగ్ ద్వారా విద్య, వైద్యం, వ్యవసాయం, ఆర్థిక స్వేచ్ఛలపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. కుటుంబ పాలనకు తావు లేకుండా, ఇద్దరికి పైగా పిల్లలున్న వారికి టికెట్లు ఇవ్వబోమని తెలిపారు. బీసీల సొమ్ము అగ్రవర్ణం ఖర్చు చేస్తున్నారు. ఈసారి బీసీలు ఏకమయ్యారు.మార్పు తప్పదు. ఈ కార్యక్రమంలో టిఆర్పి పార్టీ ఉమ్మడి నల్లగొండ అధ్యక్షుడు వట్టే జానయ్య,రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్,చక్రహరి రామరాజు,దుడుకు లక్ష్మీనారాయణ, గుంటోజు వెంకట చారి,నేలపట్ల సత్యనారాయణ,వంటెపాక యాదగిరి, సోమ మల్లయ్య, సిహెచ్.మల్లికార్జున,నజీర్ ఉద్దీన్,ఎండి మసియుద్దీన్ అడ్వకేట్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో ఘనంగా డివైఎఫ్ఐ 46 దినోత్సవం

నల్లగొండ,నవంబర్ 4 (వార్తా వేదిక సూర్య):
భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ 46 వ ఆవిర్భావ దినోత్సవాన్ని నల్గొండ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి





మల్లం మహేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. డివైఎఫ్ఐ జెండాని జిల్లా అధ్యక్షులు రవి నాయక్ ఆవిష్కరించారు. అనంతరం సుభాష్ విగ్రహం నుండి క్లాక్ టవర్ ఎన్జీ కాలేజ్ మీదుగా శివాజీ నగర్ వీధుల గుండా బైక్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ నల్గొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం రవి నాయక్, మల్లం మహేష్ లు మాట్లాడుతూ.. డివైఎఫ్ఐ దేశంలో అతిపెద్ద యువజన సంఘం ఉందన్నారు.అందరికీ విద్య, ఉపాధి అవకాశాల కోసం డివైఎఫ్ఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతుంది అన్నారు. ఒకవైపు కొత్త ఉద్యోగాలు రావడం లేదు. మరోవైపు ఉన్న ఉద్యోగాలు ఊడిపోవడం జరుగుతుంది. యువత ఉద్యోగాలు లేకపోవడంతో చెడు మార్గం పట్టే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగాలు అన్నిటిని భర్తీ చేయాలన్నారు.

డివైఎఫ్ఐ నల్గొండ జిల్లాలో గంజాయి, డ్రగ్స్ అరికట్టాలని 10 రోజులపాటు సైకిల్ యాత్ర నిర్వహించిందన్నారు. డివైఎఫ్ఐ యువతని చైతన్యం చేస్తూ మంచి మార్గంలో పయనించే విధంగా కృషి చేస్తుందన్నారు. యువజనులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల డివైఎఫ్ఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పుల్లెంల శ్రీకర్, జిల్లా ఉపాధ్యక్షులు గుండాల నరేష్ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ అక్రమ్,కట్ట లింగస్వామి, బాబు, జిల్లా కమిటీ సభ్యులు పాలాది కార్తీక్, పోకల శశిధర్, అంజి, ఆశీర్వాదం,రమేష్, సుకుమార్, నాగేశ్వర్ రావు, రాజేష్, గోపికృష్ణ, షరీఫ్, రఘువరన్,బాలరాజు, రాంబాబు, వేణు తదితరులు పాల్గొన్నారు.



# చెరువు అన్నారం హైస్కూల్ గ్రౌండ్లో జిల్లా స్థాయి అండర్ 17, 14 బాలబాలికల హ్యాండ్ బాల్ సెలక్షన్స్

నల్లగొండ, నవంబర్ 4 (వార్తా వేదిక సూర్య):
కట్టంగూరు మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెరువు అన్నారం హైస్కూల్ గ్రౌండ్లో జరిగిన 69 వ ఎస్ జి ఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్ 17 , 14 బాలబాలికల హ్యాండ్ బాల్ సెలక్షన్స్ ను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కట్టంగూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జ్ఞాన ప్రకాష్ రావు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుమూల గ్రామం అయిన చెరువు అన్నారంలో ఈ క్రీడలను నిర్వహించడం సంతోషకరం అని, ప్రతి ఒక్క క్రీడాకారుడు ఒక లక్షయాన్ని ఎంచుకొని లక్ష్యసాధనలో ముందుకు వెళ్లాలని క్రీడాకారులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందాల రమ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రీడలకు ఉమ్మడి జిల్లా నుండి 350 మంది హ్యాండ్ బాల్ క్రీడాకారులు పాల్గొనడం జరిగినది అని ఈ క్రీడల ఆర్గనైజింగ్ సెక్రెటరీ చింతకాయల పుల్లయ్య తెలిపారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లా టీమ్ కు సెలెక్ట్ అయిన అండర్ 17 బాల బాలికలు ఈనెల 7 నుండి 9 వరకు నారాయణపేట జిల్లాలో జరిగే 69 వ ఎస్ జి ఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్‌లో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ మామిడి ఉపేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కవిత, చైతన్య కుమార్, వెంకట్ రెడ్డి, కేశనాగులు, క్రాంతి కుమార్, వెంకటేశ్వర్లు, ఉస్మాన్, మల్లేష్, శంకర్, నరేష్, అక్బర్, పూర్ణ, అంజి, రాము చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తన పుట్టినరోజు సందర్భంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన డాక్టర్ సుధీర్ కుమార్

సూర్యాపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 4 (వార్తా వేదిక సూర్య):
సూర్యాపేట ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన మన అమ్మ హాస్పిటల్ ఎండీ, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దాచేపల్లి సుధీర్ కుమార్ అన్నారు.మంగళవారం డాక్టర్ సుధీర్ కుమార్ తన పుట్టినరోజు సందర్భంగా తాను చదువుకున్న నూతనకల్ మండలం ఎర్ర పహాడ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన రూ.50 వేల విలువ ప్యూరిఫైడ్ ఆర్వో వాటర్ ప్లాంట్ ను



ప్రారంభించి మాట్లాడారు.తన పుట్టినరోజు సందర్భంగా తాను చదువుకున్న పాఠశాలపై మమకారంతో విద్యార్థుల కొరకు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయటం ఆనందంగా ఉందన్నారు.తాము చదువుకున్న ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేయూతని అందించాలని కోరారు.ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వరూప లక్ష్మి, దాచేపల్లి అంజయ్య, పాఠశాల హెచ్ఎం అనంతుల కళావతి,టీచర్లు భాగ్యలక్ష్మి, సవీందర్ రెడ్డి, ఏఏపీసీ చైర్ పర్సన్ ధర్మారపు వెంకటమ్మ, కొమ్మనబోయిన అనిల్, అనంతుల బిక్షపతి, శ్రీను, నాగలింగం, అశోక్, నాగిరెడ్డి, వెంకన్న, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హాస్పిటల్ కార్మికుల పెండింగ్ జీతాలు ఇప్పించాలని ఎమ్మెల్సీ నెల్లికంటీ సత్యంకి వినతి

**కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్సీ**

నల్లగొండ, నవంబర్ 4 (వార్తా వేదిక సూర్య):
నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్ కార్మికులకు గత నాలుగు నెలల నుంచి వేతనాలు రావడంలేదని మంగళవారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకి నల్లగొండలో ఏఐటీయుసీ ఆధ్వర్యంలో మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్సీ సత్యం వెంటనే స్పందించి కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడి వెంటనే జీతాలు ఇచ్చే ఏర్పాటు చేయమని కోరడం జరిగింది.హాస్పిటల్ లో పనిచేసే వాళ్ళంతా నిరుపేద కుటుంబాల చెందిన పేద కార్మికులనీ నాలుగు నెలలుగా వేతనాలు రాకపోతే వాళ్ళ కుటుంబం ఏ విధంగా గడుస్తుందని వారు అన్నారు. అధికారులు వెంటనే కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరారు. నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఈరోజు కార్మికుల విధులు బహిష్కరించి హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ నాలుగు నెలలుగా కార్మికుల వేతనాలు లేకున్నా విధులు నిర్వహిస్తున్నారని ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని కాంట్రాక్టర్ జీతాలు ఆపడం ఎంత వరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు.

కార్మికుల వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందుల గురిచేస్తున్న ఏ వన్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



గత ఆరు నెలలుగా కార్మికులకు కాంట్రాక్టర్ పిఎఫ్ కూడా కట్టడం లేదని, నేటికీ అకౌంట్ నెంబర్లు కూడా కార్మికులకు ఇవ్వలేదని ఆరోపించారు.కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

శుక్రవారం వరకు జీతాలు చెల్లించకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కాంటాక్ట్ వర్కర్స్ రవివర్మ నాగబాబు శివ, ప్రకాశ్,అనిత ధనమ్మ,వంశీ స్వాతి రేణుక రవళి శశికల అజీమా, శోభ అరుణ శైలజ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# చదువులోనే కాదు క్రీడల్లో రాణించాలి

## మానసికంగా శారీరకంగా దృఢంగా ఉంటారు
## మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**చౌటుప్పల్, నవంబర్ 4 (వార్తా వేదిక సూర్య):** విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లో రాణించాలని అప్పుడే మానసికంగా శారీరకంగా దృఢంగా ఉంటారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ, 69వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ట్రినిటీ విద్యాసంస్థల సౌజన్యంతో చౌటుప్పల్ పట్టణంలో మల్లఖంబ్ రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ క్రీడల ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి విద్యాశాఖ అధికారులు విద్యాశాఖ అధికారులు, పాఠశాల యాజమాన్యం విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. రెండు రోజులపాటు జరిగే ఈ రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఈ ఛాంపియన్షిప్‌లో పాల్గొనే 7 ఉమ్మడి జిల్లాల క్రీడాకారుల వందన సమర్పణ స్వీకరణ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు విద్యార్థులదే, వారికి ఎంత చేసినా తక్కువే అని ఆయన అన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండండి క్రీడలకు దగ్గరగా ఉండాలని ఆయన తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేటట్లుగా తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ విద్య ప్రభుత్వ వైద్యం రెండు బాగున్నపుడే పేదలకు న్యాయం జరిగినట్లు ఉంటుందన్నారు. గ్రామాలలో మన చిన్ననాడు ప్రభుత్వ బడులు ఎలా ఉన్నాయో ఇప్పుడు కూడా అలాగే ఉన్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వ బడులను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మన ప్రభుత్వాలపైన ఉందని అన్నారు. ప్రభుత్వ బడులలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం నా వంతుగా ప్రభుత్వంతో మాట్లాడతానని అలాగే కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద కొంతమేర ప్రభుత్వ విద్యా సంస్థల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా మన్నారు. ఇటీవల మర్రిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో 1.50 కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించామని ఆయన గుర్తు చేశారు. సమాజసేవలో ఉన్న గొప్ప వ్యక్తులు ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు రావాలని సూచించారు. మల్ల ఖంబ్ క్రీడను ప్రోత్సహిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల యాజమాన్యానికి నా ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, చౌటుప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ వెనురెడ్డి రాజు నాయకులు దేవేందర్, సుర్వి నరసింహ ఆకుల ఇంద్రసేనారెడ్డి బత్తుల విప్లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.












### కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను
# నెరవేర్చడంలో పూర్తిగా విఫలం
### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్

**హైదరాబాద్, నవంబర్ 4 (వార్తా వేదిక సూర్య):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. ఆయన మంగళవారం బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ లాంటి నియోజక సాధించారని ఆయన అన్నారు మధ్యంతరం ఉప ఎన్నికల సమయంలో ప్రజలను రోలోప పెట్టి ప్రకటనలు ప్రజాస్వామయానికి అవమానమని అన్నారు ఓటు వేయకపోతే వాతకాలు ఆపేస్తామని ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆయన అన్నారు బిజెపికి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు మోడీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల ఎప్పుడు పక్షవాతం



వర్గంలో కూడా అభివృద్ధి చేయకపోవడం ఎందుకు నిదర్శనం అని ఆయన అన్నారు టిఆర్ఎస్ మరియు కాంగ్రెస్ పాలన వైఫల్యానికి ఇదొక ఉదాహరణ అని ఆయన అన్నారు వర్షం పడితే రోడ్లు చెరువులుగా మారిపోవడం డ్రైనేజీ మీరు ఇండ్లలోకి రావడం వస్తుందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా రాజకీయ ఒలోబాలు రియల్ ఎస్టేట్ లావాలో మరియు వీరసారాలపైనే దృష్టి లేకుండా కేంద్ర పథకాల ద్వారా జూబ్లీహిల్స్ కు మరియు తెలంగాణకు భారీ నిధులు విడుదల చేసిందని ఆయన అన్నారు జూబ్లీహిల్స్ లో నేను ఉన్న అభివృద్ధి అధికారి నిధుల వాళ్లే రాష్ట్ర ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని ఆయన స్పష్టం చేశారు జూబ్లీహిల్స్ బై ఎలక్షన్లలో ప్రజలు టిఆర్ఎస్ కాంగ్రెస్ నాటకాలను ముగింపు పెట్టి బిజెపిని గెలిపిస్తారని ఆయన భీమా వ్యక్తం చేశారు

## వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన
# మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**చౌటుప్పల్,నవంబర్ 4 (వార్తా వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లోనిఇటీవల కురిసిన కురిసిన వర్షాలకు చౌటుప్పల్ వర చెరువు నిండదముతో ముందు జాగ్రత్త అధికారులు ఊర చెరువుకు గండి కొట్టి నీటిని విడుదల చేశారు ఆ నీటితో సర్వీస్ రోడ్లు పలు కాలనీలో నీరు ప్రవహిస్తుంది వరద ప్రభావిత ప్రాంతాలను అధికారులు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వరద నీటిని తిరిగి పరిశీలించారు లోతట్టు ప్రాంతాలు నీట మునగకుండా వరద నీరును పరిశీలించి ,నీటిని మళ్ళించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాలతో చెరువులన్ని నిండుకుండలా మారి పడ్డ చినుకు పడ్డట్లే వరద రూపంలో కిందికి వస్తుందని చెరువులు నిండిన తర్వాత వచ్చే వరదతో గతంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎడమ వైపు ఉన్న ప్రాంతమంతా వారం రోజులపాటు నీటిలోనే ఉండేది. ఈ వరద ముప్పును ముందే ఊహించి వరదరాకుండా డైవర్షన్ చేశామన్నారు. నేషనల్ హైవే అథారిటీ సర్వీస్ రోడ్ పక్కన డ్రైన్ నిర్మించడం వల్ల కాలనీలలో పడిన భారీ వర్షాల నీరు కిందికి రాకుండా డ్రైన్ అడ్డంకిగా మారింది

దీంతో సర్వీస్ రోడ్డుపై వరద నీరు చేరింది. విషయం తెలిసిన వెంటనే ఈ ప్రాంతాలను స్థానిక ఆర్డీవో మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించి వరద నీరు, డ్రైనేజీ నీరు ఎక్కడ కూడా నిల్వ ఉండకుండా సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేషనల్ హైవే అథారిటీ కేవలం రోడ్డు పైన పడిన వర్షపు నీరు వెళ్లడానికి సరిపడా మాత్రమే సైడ్ డ్రైను ఏర్పాటు చేసింది. భవిష్యత్తులో ఎంత పెద్ద వర్షం వచ్చినా కూడా ఎటువంటి వరద ఇబ్బందులు కలగకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లి పక్క ప్రణాళికలు రూపొందిస్తామన్నారు ఆయన వెంట మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మునుగోడు ఎన్నికలు ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ , శ్రీ సీతారామచంద్ర స్వామి చైర్మన్ బొబ్బిలి మురళి నాయకులు మొగ్గుదాల రమేష్ గౌడ్ సుర్వి నరసింహ, సుర్కంటి బాలకృష్ణారెడ్డి మలిగే సాయి, మలిగే నరసింహ తదితరులు ఉన్నారు.





# ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**- మణిపూర్‌లో అత్యంత వెనుకబడిన నోనీ జిల్లాలో పర్యటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్**

**- కేంద్ర పథకాల అమలు, నోనీ జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై అధికారులతో సమీక్ష**

**- కేంద్ర పథకాలు లబ్దిదారులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరిన కేంద్ర మంత్రి**

**- జిల్లాలో నెలకొన్న పరిస్థితులు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఎదురువుతున్న సవాళ్లను కేంద్ర మంత్రికి విన్నవించిన అధికారులు**

**-మణిపూర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని ఉద్ఘాటించిన కేంద్ర మంత్రి**

**మణిపూర్:** మూడు రోజుల మణిపూర్ రాష్ట్ర పర్యటనలో భాగంగా నోనీ జిల్లాలో నిర్మిస్తున్న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జిని సందర్శించారు. మణిపూర్ రాష్ట్ర రాజధాని ఇంఫాల్ నగరాన్ని అస్సాం ద్వారా భారత రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసే జిరిబామ్-ఇంఫాల్ కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులో ఈ రైల్వే బ్రిడ్జి ఒకటి.

వాస్తవానికి ఈ రైల్వే లేన్ ప్రాజెక్ట్ మొత్తం వ్యయ అంచనా రూ.21,885 కోట్లు. ఈ రైల్వే లేన్‌కు ప్రధాన ఆకర్షణ ఈ ఎత్తైన రైల్వే బ్రిడ్జి (Bridge). సుమారు ?650 కోట్లు వ్యయంతో 703 మీటర్ల పొడవున 7 పిల్లర్లతో ఈ



వంతెనను నిర్మిస్తున్నారు. ఇందులో 2 పిల్లర్లు 141 మీటర్ల ఎత్తు కలిగి ఉండటం ప్రపంచ రికార్డు అని మణిపూర్ అధికారులు చెప్పారు.

ఇక జిరిబామ్-ఇంఫాల్ కొత్త రైల్వే లైన్ ప్రాజెక్ట్ విషయానికొస్తే.... 110 కి.మీల మేరకు నిర్మిస్తున్న ఈ రైల్వే లేన్ పనుల్లో భాగంగా ఏకంగా 55 సొరంగ (టన్నెల్స్) మార్గాలను నిర్మిస్తున్నారు. వీటి పొడవు 66 కి.మీలు. అందులో 10.25 కిలోమీటర్ల పొడవైన సొరంగం కూడా ఒకటి నిర్మాణంలో ఉంది.

ఈ నిర్మాణం పూర్తయితే దేశంలోనే అతి పొడవైన రైల్వే సొరంగాల్లో కూడా ఒకటి కానుంది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అధికారులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు తెలిపారు. 2028 డిసెంబర్ నాటికి ఈ రైల్వే లేన్ నిర్మాణాన్ని పూర్తి చేసిప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని ఆద్యంతం పరిశీలించారు. దాదాపు అర కిలోమీటర్ మేరకు నడిచి నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోయినా, ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నా వాటన్నింటినీ అధిగమిస్తూ నిర్ణీత సమయంలో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కష్టపడుతున్న అధికారులను, ఇంజనీరింగ్ సిబ్బందిని కేంద్ర మంత్రి అభినందించారు.

ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యాక మణిపూర్ రాష్ట్రం భారత రైల్వే పటంలో స్థిరమైన చోటు సంపాదిస్తుందనే నమ్మకాన్ని బండి సంజయ్ వ్యక్తం చేశారు. ప్రజల రాకపోకలకు, రవాణా సదుపాయాలకు, వర్షాకాల ఆటంకాలను అధిగమించడానికి ఈ రైల్వే లేన్ ఎంతగానో ఉపయోగపడనుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దూరదృష్టి, అకుంఠిత దీక్షకు ఇది తార్కాణంగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదన్నారు. భారతదేశంలోని మారుమూల గ్రామాల్లో, కొండ కోనల్లో నివసించే చిట్ట చివరి ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించాలనే మహోన్నత ఆశయంతో పాలన కొనసాగుతోందనడానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

అంతకుముందు కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఉదయం ఇంపాల్ నుండి హెలికాప్టర్ లో నోనె జిల్లాకు చేరుకుని జిల్లాలో అమలవుతున్న కేంద్ర సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమీక్షించారు. కలెక్టర్ శరత్ చంద్ర, జిల్లా ఎస్పీతోపాటు తమెంగ్‌లాంగ్ జిల్లాకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఈ సమీక్షా సమావేశంలో పాల్గొని పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను, అవరోధాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని వివరిస్తూ... వాటిని పూర్తి చేసే క్రమంలోనూ ఎదురవుతున్న సవాళ్లను వివరించారు. 2016 నోనీ జిల్లా ఏర్పాటైనప్పటికీ... ఇప్పటికీ జిల్లా కేంద్రంలో ప్రధాన ఆసుపత్రి లేదని, జిల్లా కోర్టు ఏర్పాటు కాలేదని, స్కూళ్లు, ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయల కొరత తీవ్రంగా ఉందని, చాలా స్కూళ్లకు టీచర్లు లేరని, 59 వేల జనాభాకు 13 మంది మాత్రమే డాక్టర్లు ఉన్నారని తెలిపారు.

ఆయా సమస్యల పరిష్కారంలో కేంద్ర సహకారాన్ని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ మణిపూర్ అభివృద్ధి కోసం కేంద్రం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని చెప్పారు. అధికారులు మరింత కష్టపడి పనిచేయాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ప్రతిపాదనలు రూపొందించి పంపాలని, కేంద్ర పెద్దలతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. సమీక్ష అనంతరం కేంద్ర మంత్రి ప్రజా ప్రతినిధులు, స్వయంసహాయక సంఘాలు (SHGs), స్థానిక నాయకులతో భేటీ అయ్యారు.

వివిధ సమస్యలను విన్నవిస్తూ వారు ఇచ్చిన వినతి పత్రాలను తీసుకుని వాటి పరిష్కారంపై ద్రుష్టి సారిస్తానని చెప్పారు. అనంతరం కార్యాలయ ఆవరణలో కేంద్ర మంత్రి బండి సంజయ్ రాకకు గుర్తుగా మొక్కను నాటించారు. మరోవైపు నోనీ జిల్లా ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సైతం కేంద్ర మంత్రి సందర్శించి... నిర్వాహకులతో మాట్లాడారు.





www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



# రాజాసాబ్ సంక్రాంతికి రావడం పక్కా..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ది రాజాసాబ్ సంక్రాతికి పక్కా అని నిర్మాత తేల్చి చెప్పారు.. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ధి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఎప్పుడెప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందా అని అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఇక ప్రభాస్ సినిమా అంటే వాయిదా లేకుండా రిలీజ్ ఉండదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ది రాజాసాబ్ కూడా అదే తరహాలో వరుస వాయిదాలు పడుతూ వస్తుంది. డిసెంబర్ 5 న అనుకున్న సినిమా మరోసారి వాయిదా పడి సంక్రాంతి బరిలో దిగింది. జనవరి 9 న ది రాజాసాబ్ రిలీజ్ కు సిద్ధమవుతుంది. ఇక గతకొన్నిరోజులుగా సంక్రాంతి నుంచి కూడా రాజాసాబ్ తప్పుకుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా రాజాసాబ్ వాయిదా రూమర్స్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఖండించాడు. కచ్చితంగా రాజుగారు సంక్రాంతికి వస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నట్లు.. డిసెంబర్ లో అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయనున్నట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ఉండాలని అభిమానులను కోరాడు. ప్రసుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. మరి ఈ సిని మాతో ప్రభాస్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

# పెద్దిలో మొహిత్ చౌహాన్ పాట

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్స్ షురూ అయ్యాయి. సినిమాకు సంబంధించి ఏదో ఒక అప్‌డేట్ ఇస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. తాజాగా కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ క్యారెక్టర్ రివీల్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. అలాగే ఫస్ట్ సింగిల్ టైటిల్ కూడా తెలిపారు. ఈ పాట 'చికిరి' అనే లైన్‌తో ప్రమోషనల్ వీడియోలో రెహమాన్ కూడా కనిపించబోతున్నారు. చికిరి పాటకి సింగర్ గా మోహిత్ చౌహాన్‌ను ఎంపిక చేశారాయన. హిందీలో ఆయన ఎన్నో హిట్ చిత్రాలకు పాటలు పాడారు. అక్కడ ఆయన ఎంతో పాపులర్. 'రాక్ స్టార్' సినిమాలో మొత్తం 15 పాట ఉంటే అందులో తొమ్మిది పాటలిన మోహిత్ ఛౌహాన్‌తోనే పాడించారు రెహమాన్. దాంతో ఆయన పేరు



ఉంటుందని తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా ఎ.ఆర్.రెహమాన్ వెల్లడించారు. దర్శకుడు, సింగర్ మోహిత్ చౌహాన్‌తో కలిసి కీ బోర్డ్ ముందుకు కూర్చున్న ఫొటోను రామ్‌చరణ్ షేర్ చేసి ఏం వండుతున్నారు గయ్స్' అని ట్వీట్ చేశారు. దానికి 'చికిరి చికిరి.. చరణ్‌గారు' అంటూ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ రిప్లై ఇచ్చారు. దర్శకుడు కూడా అదే సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎక్స్‌లో వీరి సంభాషణ నెట్టింట వైరల్ మారింది. పాట కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు అభిమానులు పోస్ట్‌లు పెడుతున్నారు. అయితే ఈ పాట పాపురల్ అయింది. మోహిత్ తెలుగు సంగీత దర్శకులతో ఎక్కువ పని చేయలేదు కానీ తమిళ సినిమా పాటల్ని తెలుగులో పాడారు. ఆయన వాయిస్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ఆయనపై ప్రత్యేక అభిమానంతో 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో 'ఇదేరా' అంటూ సాగే పాటను పాడించారు. తర్వాత డైరెక్ట్ తెలుగు సినిమా పాడిన సందర్భం లేదు. ఇప్పుడు 'పెద్ది' సినిమాతో తెలుగులో మళ్లీ పాడుతున్నారు. అయితే పెక్యులర్ వాయిస్ చికిరి పాటకు కొత్తదనం తీసుకొస్తుందని టీమ్ బలంగా నమ్ముతోంది.



# థ్రిల్లర్ మూవీలో మీనాక్షి చౌదరి

ప్రముఖ నటి మీనాక్షి చౌదరి కొత్త పాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ దండు ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్. సోమవారమే ఈ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను విడుదల చేస్తామని నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెలిపారు. అయితే చేవెళ్ళ బసు దుర్ఘటనతో దానిని ఈ రోజుకు వాయిదా వేశారు. ఆ ప్రకారంగా మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్ పోస్టర్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇంకా పేరు పెట్టని ఈ మిథికల్ థ్రిల్లర్ మూవీలో దక్ష అనే ఆర్కియాలజీ సైంటిస్ట్ పాత్రను మీనాక్షి చౌదరి చేస్తోంది. తాజా విడుదలైన పోస్టర్ చూస్తుంటే... ఈ పాత్ర సినిమాలో చాలా కీలకమైందనేది అర్థమౌతోంది. దర్శకుడు సుకుమార్ సైతం నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాతో 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు అజనీశ్ బి. లోకనాథ్ దీనికి సంగీతం అందిస్తున్నాడు.



## దుల్కర్ సల్మాన్..కాంత మూవీ

మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న సినిమా కాంత పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కు తున్న ఈ చిత్రాన్ని సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ పాన్ ఇండియా సినిమా నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు. ఇటీవలే రేజ్ ఆఫ్ కాంత ట్రాక్‌ను విడుదల చేయగా సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ సాయంత్రం 4 గంటలకు తొలిమెరుపు ఉండబోతుందని నేడు కొత్త పోస్టర్ లాంచ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని రోల్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ ఆ తొలి మెరుపు ఏంటనేది క్లారిటీ రానుంది. ఇప్పటికే కాంత మూవీ నుంచి అమ్మాడివే సాంగ్‌ను విడుదల చేశారని తెలిసిందే. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో వచ్చే ఈ మెలోడీ ట్రాక్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. భారతీయ సినిమాలో 1960ల నాటి గత యుగానికి నివాళిగా తెరకెక్కుతున్న కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

# పిఠాపురంలో..అలా మొదలయ్యింది



తొలి చిత్రం 'ప్రేయసి రావే'తోనే దర్శకునిగా తన సత్తా చాటుకున్నారు మహేష్ చంద్ర అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆయన రూపొందించిన చిత్రం 'పిఠాపురంలో'.

'అలా మొదలైంది' అనేది ఉపశీర్షిక. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య తారాగణంగా ఈ చిత్రం రూపొందింది. మహేష్ చంద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్‌ఎం మురళి నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సందర్భంగా దర్శకుడు మహేష్‌చంద్ర మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో 'పిఠాపురం' అనేది ఎంతలా మారుమోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 28 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో 6 రోజులు చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలు ఉంటాయి. గోవాలో ఒక పాటను, హైదరాబాద్‌లో సెట్‌వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్‌లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన రామానాయుడు గారి స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అని తెలిపారు.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305**, Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya2025@gmail.com**